

14,15 తేదీల్లో ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా పర్యటన

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ 14,15 తేదీలలో రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఏ.మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 10.30గంటలకు కుప్పం ఆర్అండ్ బి అతిథిగృహం చేరుకుని రాత్రి బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రామకుప్పం మండలం, వీరణమాల పెద్దతాండ చేరుకొని అక్కడ ఉన్న గిరిజనలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. రోడ్డు మార్గాన చిత్తూరు ఆర్అండ్ బి అతిథి గహం చేరుకొని రాత్రి బస చేస్తారు. శనివారం ఉదయం 10.30 గంటలకు గంగవరం మండలం, కుయ్యవంక గిరిజన కాలనీ నందు గిరిజనలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని తిరిగి విజయవాడకు బయలుదేరి వెళ్ళతారని తెలిపారు.



వాడివేడిగా అంగన్‌వాడీలు







నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు, వాడ గంగరాజు, సురేంద్రలను అరెస్టు చేస్తున్న పోలీసులు

- 36 గంటల మహాధర్నా సక్సెస్
- డిమాండ్లు పరిష్కరించాలని జేసీకి వినతి
- రాత్రంతా 'ఆటాపాటలతో' జాగారం
- దోమలు కుడుతున్నా మొక్కవోని దీక్ష
- సామూహిక వంటావార్పుతో సందడి
- చిత్తూరులో పోలీసుల హంగామా

'అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలి' అని డిమాండు చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ల వద్ద చేపట్టిన 36 గంటల మహాధర్నా మంగళవారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. తిరుపతి, చిత్తూరు జిల్లాల నలుమూలల నుంచి విచ్చేసిన అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షతో కలెక్టరేట్ ప్రాంగణంలోనే వంటావార్పు చేసి సామూహిక భోజనాలు చేసి ఐక్యతను చాటారు. సోమవారం రాత్రంతా దోమలు బీభత్సంగా కుడుతున్నా 'ఆటాపాట'లతో సందడి చేశారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కాదని, ఇచ్చిన హామీలనే అమలు చేయమని కోరుతున్నామని, జగన్ ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇచ్చేంత వరకూ 'మాట తప్పం...మడమ తిప్పం... తగ్గేదేలే..' అంటూ నినదించారు. డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని తిరుపతి జేసీకి వినతిపత్రం ఇచ్చి 36 గంటల మహాధర్నాను విజయవంతంగా ముగించారు. చిత్తూరులో రాస్తారోకో నిర్వహించడంతో పోలీసులు రంగంలోకి దిగి అరెస్టులకు పూనుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏదిఏమైనా తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్ల వద్ద మహాధర్నా పోరాట స్ఫూర్తిని రగిలించింది. రెండో రోజు అంగన్‌వాడీలో యూనీఫాంతో నిరసన తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : సిఐటియు

చిత్తూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై చూపుతున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా 36 గంటల పాటు చేపట్టిన నిరసన దీక్ష విజయవంతమైంది. మంగళవారం దీక్ష ముగింపు సందర్భంగా అంగన్వాడీలు వేలూరు నేషనల్ హైవేను దిగ్బంధించారు. ఈ సందర్భంగా పోలీసులు అంగన్వాడీలను హెచ్చరిక చేస్తూ రోడ్డు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడ్డారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకూ తాము కదిలేది లేదని భీష్మించుకున్నారు. ఇంతలో టూ టౌన్ సీఐ సంఘటన స్థలానికి చేరుకొని సిఐటియు నాయకులు వాడ గంగరాజు, సురేంద్ర, గిరిధర గుప్తాలను అరెస్టు చేయడానికి సిద్ధమయ్యారు. తీవ్రంగా ప్రతిఘటన ఉద్యమకారుల నుంచి ఎదురుకావడంతో చేసేదేమీ లేక వదిలేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఒకవేళ అణచడానికి ప్రయత్నిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణా ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లబ్దిదారులకు ఇచ్చే ఆహారం పురుగులు పట్టి ఉందని, నాణ్యతగా ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన వెంటనే బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి పోరాటాన్నీ విజయవంతం చేయాలని కోరారు. రెండో రోజు అంగన్‌వాడీల పోరాటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు, మెడికల్ షాప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మహిళాసంఘం జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు షకీల, ప్రమీల, సరళ, కస్తూరి, శ్యామల, అనిత, పద్మ, సుజని, విజయ, పంచవర్మ పాల్గొన్నారు.



యాప్‌ల పేరుతో వేధింపులు మానుకోవాలి - ప్రమీల, కుప్పం ప్రాజెక్ట్, అంగన్వాడీ

వైఎస్సార్ యాప్‌ల వలన అంగన్వాడీలకు భారంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేనందున ఇబ్బందు తప్పడం లేదు. అలాగే రాజకీయ నాయకుల వేధింపులు, కుప్పం ప్రాజెక్టులో సిడిపిఓ వేధింపులు అధికంగా ఉన్నాయి మానుకోవాలి. వేధింపులు అధికమైతే పెద్దఎత్తున ఆందోళన ఉధృతం చేస్తాం. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఉద్యోగ విరమణ చేసిన తరువాత జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలి. కేంద్ర తీసుకొచ్చిన జీవోను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి.



సంక్షేమ పథకాలు అమలు చేయాలి - షకీలా, యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. పథకాలు ఆపేయడం అన్యాయం. అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి. 2017 నుంచి జీతాలు పెంచలేదు. పిల్లలకు సరిపడ్డా సంపూర్ణ పోషణ సరఫరా చేయాలి. లబ్దిదారులను కుదించేందుకు పోషణ్ ట్రాక్ యాప్‌ను తీసుకొచ్చి ప్రయివేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారు అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలి.



అర్హులకు గ్రాట్యూటీ అమలు చేయాలి - లలిత, యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటి అమలు చేయాలి. ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలి. అలాగే 2017 నుంచి టిఏ బిల్లులు ఇవ్వడం లేదని, 2022 ఏప్రిల్ 25న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటికి అర్హులని తెలిపింది కనుక అర్హులకు గ్రాట్యూటీ అమలు చేయాలి.



మినీ అంగన్‌వాడీ వర్కర్స్‌కు జీతాలు పెంచాలి - సుజని చిత్తూరు ప్రాజెక్ట్, అంగన్వాడీ

మినీ అంగన్‌వాడీ వర్కర్స్‌కు జీతాలు పెంచాలి. అంగన్వాడీల్లో సౌకర్యాలు పెంచాలి. వైఎస్సార్ సంపూర్ణ మెనూ ఛార్జీలు చెల్లించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఇవ్వాలి. మినీ అంగన్వాడీ సెంటర్‌లో సమస్యలు పరిష్కరించాలి.



హామీలు అమలయ్యేవరకూ తగ్గేదెలే..!

తిరుపతి సిటి : తిరుపతి కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల మహాధర్నా మంగళవారం సాయంత్రం ముగిసింది. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటి అమలు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు జూలై 10న కోర్కెల దినం సందర్భంగా 36 గంటల పాటు మహాధర్నా నిర్వహించేందుకు పూనుకున్న విషయం విదితమే. అందులో భాగంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా 13 ప్రాజెక్టుల ఆధ్వర్యంలో జిల్లా నలుమూల నుంచి వేలాది మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మిని వర్కర్లు పెద్ద ఎత్తున జిల్లా కలెక్టరేట్‌కు తరలి వచ్చి, రాత్రంతా దోమలు కుడుతా ఉన్నా అక్కడే పడుకుని, కళాప్రదర్శనలతో జాగారం చేశారు. మధ్యాహ్నం వంటావార్పు అనంతరం జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ, ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. సిఐటియు నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా 2018లో అంగన్‌వాడీ వర్కర్లకు 1500, హెల్పర్లకు 750, మినీ వర్కర్లకు 1250 రూపాయలు పెంచుతున్నామని ప్రకటన చేసి, ఇంత వరకు అమలు చేయలేదని తెలిపారు.ఏపి అంగవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మనీల, వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్రంలోని మోడి ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో 26 లక్షల మంది అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందికిపైగా ఉన్న స్కీం వర్కర్లకు ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. ఐసిడిఎస్‌కు నామమాత్రంగా అదనంగా 91 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారన్నారు. ఇది పెరిగిన ధరలకు ఏమాత్రం సరిపోదని తెలిపారు. గత 48 సంవత్సరాలుగా బాలింతలకు, గర్భిణీలకు, పిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు కనీస ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. విజిట్ల పేరుతో అంగన్‌వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించేందుకు వెనుకాడబోమని, గతంలో చంద్రబాబుకు పట్టిన గతే జగన్మోహన్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. అనంతరం సిఐటియు నాయకులతో కలిసి అంగన్‌వాడీలు జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీని కలిసి తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. దీనిపై స్పందించిన జేసి అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు అంగేరి పుల్లయ్య, జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మీ, వేణు, సాయిలక్ష్మీ, జయంతి, జయచంద్ర, సుబ్రమణ్యం, నరేంద్ర, మునిరాజా, నాగరాజు, గుర్రవయ్య, రమేష్, బుజ్జమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రసాదరావు, వాణిశ్రీ, హైమావతి, 13 ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుపతిలో..

గృహనిర్మాణం చేపట్టకుంటే పట్టా రద్దు

ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎన్‌సిడి సర్వే వందశాతం పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పలమనేరు, బైరెడ్డిపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 11 రకాల ధవ పత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. మంగళవారం పలమనేరు, బైరెడ్డిపల్లి మండలాలలో ప్రభుత్వం ద్వారా చేపట్టిన వివిధ అభివద్ధి కార్యక్రమాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలమనేరు మండలం టి.ఒడ్డురు గ్రామంలిలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఇందులో 51 గహాలు మంజూరు కాగా బిబిఎల్ 10, ఆర్ఎల్7, ఆర్‌సి6 గహాల నిర్మాణాలు ఉండగా 28 గహాల నిర్మాణాలు పూర్తి అయ్యినట్లు హౌసింగ్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. అలాగే పెంగరగుంట జెడ్‌పి హైస్కూల్ ను పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను, రూ.1.20కోట్లతో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పాఠశాలలో 469 మంది విద్యార్థులు ఉన్నారని, హాజరైన విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని హెచ్ఎం కలెక్టర్‌కు వివరించారగా మధ్యాహ్న భోజనం రుచికరంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్‌లో జరుగుతున్న నాడు -నేడు పనులను పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని, ఆట స్థలానికి అవసరమైన భూమిని దాతలు ఇచ్చారని, ఆట స్థలం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలని, ఎన్ఆర్ఈజిఎస్ కింద ప్రాంగణంలో లెవెలింగ్ చేసి మొక్కలు పెంపకం చేపట్టాలన్నారు. అనంతరం తీర్థం గ్రామంలోని పిహెచ్‌సి పరిశీలించారు. రోజూ 120 మందికి వైద్యం అందించడం జరుగుతోందని, 202 మంది గర్భిణులు పిహెచ్‌సి పరిధిలో ఉన్నారని, 9 మంది హైరిస్క్ వారు ఉన్నారని పిహెచ్‌సి వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల విషయం శ్రద్ధ చూపాలని 83 శాతం ఉన్న ఎస్‌సిడి సర్వే వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్యకేంద్రంలో నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని పిహెచ్‌సి వైద్యులు కలెక్టర్‌ను కోరడంతో వాచ్‌మెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తీర్థం హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌లో 31 గృహాలు మంజూరు కాగా అందులో బిఎల్ స్థాయిలో 9, ఆర్ఎల్ 5, ఆర్‌సి స్థాయిలో 2 గృహ నిర్మాణాలు ఉండగా 15 ఇళ్ల పనులు పూర్తి అయ్యాయని హౌసింగ్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణాలకు అవసరమైన నీటి వసతి, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమైందని, ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలని లేకుంటే రద్దు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్సీ భరత్, ఎంపిపి రెడ్డప్ప, పలమనేరు, బైరెడ్డిపల్లి తహశీల్దార్లు కుప్పస్వామి, కుమారస్వామి, ఎంపిడిఓలు విద్యాసాగర్, బాలాజీ, పంచాయతీరాజ్ డీఈ నవీన్ కుమార్, హౌసింగ్ డీఈ రమేష్ రెడ్డి, ఎంఈవోలు, గడ్డురు సర్పంచ్ దేవేంద్ర గౌడ, ఎం కొత్తూరు సర్పంచ్ రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అమూల్ పాలసేకరణ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



పాడి రైతులతో సమావేశమైన జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- వికోట: పాడి పోషణ ద్వారా మహిళలు స్వయం ఉపాధిని పొందడంతో పాటు ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు కషిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రాత్రి వి.కోట మండలం పత్రపల్లి సచివాలయ పరిధిలోని పత్రపల్లి గ్రామంలో అమూల్ పాలసేకరణ కేంద్రంను జెసి పరిశీలించి మహిళా పాడి రైతులతో సమావేశమయ్యారు. జెసి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు స్వయం ఉపాధి నిమిత్తం పాడిపోషణ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. అమూల్ పాలసేకరణ కేంద్రంలో కనీస ధర రూ.33.25 పైసలు నుండి గరిష్టంగా 43 రూపాయల వరకు ధర రావడం జరుగుతున్నదని, పాడి పోషణ ద్వారా అభివద్ధి చెందేందుకు గడ్డి కత్తిరించే యంత్రాలు, పాలు పితికే యంత్రాలు సబ్సిడీతో మంజూరు చేయాలని మహిళా పాడి రైతులు జెసి దష్టికి తీసుకొని వచ్చారు దీనిపై జెసి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత శాఖాధికారులతో ఈవిషయంపై చర్చించి చర్యలు చేపడతామని తెలిపారు. జెసి వెంట ఆర్డీఓ శివయ్య, ఎంపీపీ యువరాజ్, అధికారులు పాల్గొన్నారు.

'పొదుగు వాపు'తో పశువులు విలవిల

- లబోదిబోమంటున్న పాడి రైతులు
- వందల సంఖ్యలో మృత్యువుకు చేరువ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందని వైద్యం
- 'ప్రైవేట్'లో రూ.పదివేల పైమాటే

ప్రజాశక్తి - గుడిపల్లి

గుడిపల్లి మండలం కోటపల్లికి చెందిన పాడి రైతు ఎన్.సుబ్రమణ్యం పాడి ఆవుకు పొదుగువాపు వ్యాధి మూడు రోజుల క్రితం వచ్చింది. పొదుగుకు వాపు వచ్చి పాలు ఇవ్వకుండా పోయింది. దీంతో తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ నీరసంతో చనిపోయే పరిస్థితి కనిపించింది. 90వేల రూపాయల విలువ చేసే పాడి ఆవు కళ్లెదుటే బాధపడుతుంటే తట్టుకోలేక సుబ్రమణ్యం దగ్గరలోని ప్రభుత్వ పశు వైద్యశాలకు వెళ్లాడు. అయితే అక్కడ పొదుగు వాపు వ్యాధికి సంబంధించి ఎటువంటి వైద్యం అందే పరిస్థితి లేదని తెలియడంతో దిక్కుతోచని పరిస్థితిలో ప్రైవేట్‌ను ఆశ్రయించాడు. ఒక్కరోజే ఐదువేలయ్యిందని, వ్యాధి మొత్తం తగ్గేసరికి 15వేలు తప్పనిసరిగా అవుతుందని, తనలాంటి పేదవాడు పశువులకూ డబ్బు ఎక్కడ పెట్టి వైద్యం అందించగలరని మీడియాతో వాపోయాడు.

పట్టించుకోని ప్రభుత్వ వైద్యాధికారులు

పాడి ఆవుల్లో పొదుగువాపు వ్యాధి విజృంభిస్తోంది.. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో వందల్లోనే పశువులు వ్యాధి బారిన పడి 'మృత్యువు'కు దగ్గరగా ఉన్నాయి.. అయితే వెటర్నరీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ పొదుగు వ్యాధికి వైద్యం అందకపోవడం గమనార్హం. వ్యాధి రాకుండా ముందస్తు ఇంజక్షన్లు సైతం వేసే పరిస్థితి లేదు. మందులు లేకుండా తామెలా వైద్యం అందించగలమని ప్రభుత్వ వైద్యులు మొహానే చెప్పేస్తున్నారు. దీంతో కళ్లెదుటే వేలాది రూపాయల విలువ చేసే పశువులు మృత్యువుకు చేరువవుతుంటే పాడి రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఒక్కరోజు వైద్యం అందించినందుకు ఐదువేలకు పైగా ఖర్చయ్యిందని, అసలే కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్న తాము పశువులకూ ప్రైవేట్‌లో వైద్యం ఎలా అందించగలమని బాధితులు వాపోతున్నారు. తిరుపతిలో వెటర్నరీ యూనివర్సిటీ ఉన్నా, పశు వైద్యశాఖ విభాగం ఉన్నా తమకేమి ఉపయోగమని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. పశువైద్య శిబిరాలు నిర్వహించి పొదుగువాపు వ్యాధిని నివారించాలని, ముందస్తు ఇంజక్షన్లు చేయాలని వారు కోరుతున్నారు.





మందులు లేకుండా వైద్యమెలా..? రవినాయక్, ఇన్‌ఛార్జి ప్రభుత్వ వైద్యాధికారి, గుడిపల్లి

పొదుగువ్యాధి వ్యాధి మండలంలో ఉంది. అయితే మా దగ్గర మందులు లేవు. ఇంజక్షన్లు, ఆయిట్మెంట్లు ప్రభుత్వం దగ్గర నుంచి రావడం లేదు. మీ పశువులు బతకాలంటే ప్రైవేట్ వైద్యులను సంప్రదించండి అని వారే 'చావు కబురు చల్లగా' సూచన చేయడం గమనార్హం.

ఉపాధి కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు

డ్వామా పీడీ గంగా భవాని సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరు: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు గంగాభవాని క్షేత్రసాయి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం యాదమరి, తవణంపల్లి, పెనుమూరు మూడు మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలకు అవసరమైన చోట ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ రైతులకు ఉపయోగపడే విధంగా వారి పంట పొలాల్లో సరిహద్దు కందకాలు, మామిడి చెట్ల చుట్టూ కందకాలు, సప్లై ఛానల్స్, రైతులకు అవగాహన కల్పించి మంజూరు చేయ్యాలన్నారు. గ్రామాల్లో ఫ్రైడే సమావేశాలు నిర్వహించి రైతులకు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచాలని లేకుంటే చర్యలు తప్పవని క్షేత్రసాయి సిబ్బందిని హెచ్చరించారు. యాదమరి మండలంలో 14 కండిగ గ్రామపరిధిలో మామిడి పెంచుతున్న రైతు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పండ్లతోటల కోసం ఎదురు చూసి ఇప్పుడు మంజూర్వడం తమకెంతో ప్రయోజనం ఉందని ఉపాధి బిల్లులు సక్రమంగా అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పిడి గంగాభవాని మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పరిధిలో మామిడి పండ్ల తోటలు 7200 ఎకరాలు మంజూరయ్యాయని అందులో ఇప్పటికే 5వేల ఎకరాలు సంబంధించి మామిడి చెట్లకు గుంతలు తవ్వుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో 6వేలకు పైగా మామిడి చెట్ల పెంపకం మరో 1200 కొబ్బరి చెట్లు, డ్రాగన్ ఫ్రూట్స్, జామ వివిధ రకాల పండ్ల తోటలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల చివరిలోపు పండ్ల తోటలు మంజూరైన ప్రతి రైతు మొక్కలు నాటుకునే విధంగా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి రైతుకు బిల్లుల చెల్లింపులో పారదర్శకత పాటిస్తూ సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోనాపల్లి సచివాలయాన్ని ఉపాధి హామీ సంచాలకులు గంగాభవాని తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో ఎంత మంది ఉపాధి కూలీలు ఉన్నారు ఎంతమందికి ఉపాధి పనులు కల్పిస్తున్నారు అని ఆరా తీశారు. మండలం పరిధిలో ఉపాధి కూలీల మరింత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీవో బాలను ఆదేశించారు. తహశీల్దార్ హనుమంతు, ఎంపీడీవో శివరాజ్, ఏపీవో బాల, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.



కోనాపల్లి సచివాలయాన్ని పరిశీలిస్తున్న పిడి గంగాభవాని

ఏకాంబరకుప్పం స్టేషన్‌లో ఆగనున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్



ప్రజాశక్తి-నగరి: స్థానిక ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ఆగనున్నది నాలుగేళ్లుగా ప్రజల కోరిక. గతంలో ఈ స్టేషన్‌లో ఉన్న స్టాపింగ్‌ను కోవిడ్ సమయంలో కేంద్ర రైల్వే అధికారులు తీసేశారు. దీంతో ఉదయాన్నే చెన్నైకి వెళ్లె వివిధ పనులకు హాజరయ్యే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేట్ కంపెనీల్లో షిఫ్టులకు హాజరయ్యే ఉద్యోగులకు, చెన్నైలోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన వారు సరైన సమయానికి ట్రైన్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. కాచిగూడ ట్రైన్‌ను ఏకాంబరకుప్పం స్టేషన్‌లో ఆగేలా చెయ్యాలంటూ మంత్రి ఆర్కేరోజాకు విన్నవించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండే మంత్రి ఆర్కేరోజా ఈ అంశంలో తనదైన శైలిలో పట్టువదలకుండా పోరాడారు. రైల్వే జీఎంకు, డీఆర్ఎంకు లేఖలు రాయడంతోపాటు ప్రత్యక్షంగా వెళ్లి కలిసి సమస్యను వివరించారు. ప్రజల నాలుగేళ్ల వాంఛను నెరవేర్చారు. ఈ నెల 17వ తేదీ ఏకాంబరకుప్పం స్టేషన్‌లో కాచిగూడ ట్రైన్‌ను ఆపనున్నట్లు మంగళవారం సదరన్ రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉదయం 4.18 కి ఏకాంబరకుప్పం స్టేషన్‌లో ఆగి 4.20కి ఈ ట్రైన్ బయలు దేరుతుంది. ఈ స్టేషన్ నుంచి వెళ్లడానికి ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా అందుబాటులో ఉంది.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి-నగరి: వివిధ కేసుల్లో పట్టుబడి నగరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాలను బుధవారం వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి, జీఎస్టీ కల్గినవారు వాహనాలను వేలంలో పొందవచ్చన్నారు. వేలం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలి



ప్రజాశక్తి-సోమల: పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటిస్తూ, ఉదయాన్నే పాఠశాల శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ-2 శివరత్నమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని అడుసుపల్లి, సోమల దళితవాడ గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయాన్నే ఆయాలు పాఠశాలకు వచ్చి చెత్తా చెదారాన్ని తొలగించి పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచి క్రిమిసంహారక మందుల ద్వారా కడగాలని ఆదేశించారు. అపరిశుభ్ర వాతావరణంలో విద్యార్థులు తిరిగితే వారికి అనారోగ్య పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, పరిశుభ్రతపై దృష్టి సారించాలని పాఠశాల సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

రైతులకు అవగాహన సదస్సు



ప్రజాశక్తి-గుడుపల్లి: మండలంలోని గుండ్ల సాగరం రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట సాగుదారు హక్కు పత్రంపై మండల వ్యవసాయ అధికారి నాగరాజు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు తన పేరు మీద పొలం లేకపోయినా లేదా అతని పేరు మీద పొలం ఉండి వేరే వాళ్ళ పొలాన్ని కౌలుకు చేసుకునే రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సహాయంతో రెవెన్యూ శాఖ ద్వారా ఈ పంట సాగు హక్కు పత్రం పొందవచ్చని తెలిపారు. దీనికి పంటను కౌలికి చేసుకునే రైతు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటో అలాగే భూ యజమాని ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జిరాక్స్, ఇద్దరి మధ్య కౌలికి చేసుకుంటున్నట్లు అంగీకార పత్రంపై సంతకాలు చేసుకొని మీ రైతు భరోసా కేంద్రంలో ఇస్తే రెవెన్యూ శాఖ ద్వారా వాళ్లకు పంట సాగుదారుకు పత్రం ఇప్పిస్తారని చెప్పారు. ఈ పంట సాగుదారు పత్రం ద్వారా కౌలికి చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు రైతు భరోసా పథకంతో రూ.13,500 అలాగే కౌలు కార్డు తీసుకున్న రైతులందరికీ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ సంబంధిత లబ్ది కూడా పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-వి.కోట: ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వి.కోట గ్రామపంచాయతీ పాపేపల్లి సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను, నాణ్యతను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. అర్హులైన లబ్దిదారులకు అడ్వాన్స్ నగదు చెల్లింపు ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. గడువులోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారుల ఇంటి పట్టాలను రద్దు చేస్తారని, ఈ విషయం లబ్ధిదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తిగా ప్రభుత్వమే చేపడుతుందని లబ్దిదారులకు హామీ ఇచ్చారు. లేఅవుట్ పరిధిలోని గ్రామపంచాయతీ డంపింగ్ యార్డ్ స్థలాన్ని వారంలోపు ప్రత్యామ్నాయ స్థలానికి మార్పు చేయాలని తహశీల్దారును ఆదేశించారు. అనంతరం బంగ్లా ఊరు సమీపంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఒక్క సమీపంలో ఆర్‌బికె భవనాలను పరిశీలించారు. ఒక సచివాలయంలో సిబ్బందితో సమావేశమై జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నుండి ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాలు పొందే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రజలకు తెలియజేసి, వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. వీరి వెంట ఎంపీపీ యువరాజ్, వైస్‌ఎంపీపీ తమీంఖాన్, ఎమ్మార్వో చిట్టిబాబు, హౌసింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీపీ లతాబాలాజీ సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానికంగా ఎంపీపీ లతాబాలాజీ చేసిన సేవలు అభిందనీయమని ఉప ముఖ్య మంత్రి కళత్తూరు నారాయణ స్వామి అన్నారు. మంగళవారం కార్వేటినగరం, గాండ్లమిట్ట కూడలిలో ఎంపీపీ లతాబాలాజీ పుట్టినరోజు వేడుకలలో భాగంగా ఉప ముఖ్యమంత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ లతాబాలాజీ దంపతులు కరోనా సమయంలో కార్వేటినగరంలోని ప్రతి ఇంటికీ కూరగాయలు పంపిణీ చేశారని, పేదలకు మాజీ జడ్పిటిసి ఆర్.శ్రీరాముల నాయుడు పేరుతో ఉచిత వైద్య శిబిరాలు చేపట్టి అందిరి మనన్నలు పొందారని తెలిపారు. కార్వేటినగరం మండలం ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టి ఎన్నో సేవలు, అభివద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. శ్రీరాములు నాయుడు సర్పంచ్‌గా, సింగల్ విండో అధ్యక్షులుగా, జడ్పిటిసిగా ఎన్నో సేవలు చేసి మంచి పేరు ప్రతిష్టలు సంపందించుకున్నారని గుర్తు చేశారు. తండ్రికి తగ్గ తనయుడు బాలాజీ పేరు రావడం సంతోష తగ్గ విషయమన్నారు. ఎంపీపీ పుట్టినరోజు సందర్భంగా లతాబాలాజీ 500 మందికి అన్నదానం చేశారు. అలాగే వద్ధాశ్రమంలోని వద్ధులకు స్వీట్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెదురుకుప్పం ఎంపీపీ హేమసుందర్ రెడ్డి, జడ్పిటిసి సుకుమార్, మండల కన్వీనర్ శేఖర్ రాజు, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, పద్మనాభ రెడ్డి, వైస్ ఎంపీపీ కార్తీక్ రెడ్డి, మన్నెమ్మ, ఎఎంసి ఛైర్మన్ కష్ణయాదవ్, వైస్ ఛైర్మన్ గోపి, పద్మనాభ శెట్టి, యుగంధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తానాలో జిల్లావాసులకు చోటు



సునీల్ పంత్ర



లోకేష్


ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అమెరికాలో అతిపెద్ద తెలుగు సంఘమైన ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) కార్యవర్గంలో చిత్తూరు జిల్లావాసులకు చోటు దక్కింది. చిత్తూరు జిల్లాకు చెందిన సునీల్ పంత్రకు జాయింట్ ట్రెజరర్‌గా, లోకేష్ కొణిదెలకు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ పదవి లభించింది. వీరిద్దరూ తానా ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాలను చిత్తూరు జిల్లాలోనూ, అమెరికాలోనూ చేస్తున్నారు. సునీల్ పంత్ర తానాలో వివిధ పదవులను నిర్వహించారు. తానా రీజినల్ రిప్రజెంటేటివ్‌గా, కల్చరల్ కో-ఆర్డినేటర్‌గా చైతన్య స్రవంతి కోఆర్డినేటర్‌గా పదవులను చేపట్టి ప్రస్తుతం తానా జాయింట్ ట్రెజరర్ పదవిని చేపట్టనున్నారు. లోకేష్ కొణిదెల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్, కౌన్సిలర్ ఎట్‌లార్జ్ పదవులను నిర్వహించి ప్రస్తుతం కమ్యూనిటి కోఆర్డినేటర్ పదవిని చేపట్టనున్నారు. చిత్తూరు జిల్లావాసులకు తానా కార్యవర్గంలో చోటు లభించడం పట్ల చిత్తూరు జిల్లా ఎన్నారైల సంఘంతోపాటు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

16న వృత్తిదారుల ఉమ్మడి జిల్లా సదస్సు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చేతి వృత్తిదారుల సమైక్య ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు చేతి వృత్తిదారుల సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి డి.రామచంద్రయ్య మంగళవారం చిత్తూరులో గోడ పత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చేతి వత్తిదారులకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించి ముడి సరుకులు 55శాతం సబ్సిడీ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సబ్‌ప్లాన్లు నుండి వత్తుల వారీగా ప్రభుత్వ నిధులు విడుదలచేసి ఖర్చు చేయాలని, ఫెడరేషన్ కార్పొరేషన్ సమర్ధవంతంగా నిర్వహించాలని, వత్తిదారులకు సహకారరంగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన ప్రతి వత్తిదారునికి నెలకు రూ.5 వేలు పెన్షన్ అందించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వత్తిదారుల పిల్లలకు ఎల్‌కెజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని కోరారు. పై సమస్యలన్నీ సదస్సులో చర్చించి 21న అనంతపూరు జిల్లాలో జరిగే రజక సదస్సులు భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు.

ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేలు అందించాలి

ప్రజాశక్తి-పలమనేరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో మన రాష్ట్రంలో ప్రతి రైతుకూ ఎకరాకు రూ.10 వేలు అందించాలని జిల్లా రైతు నేత ఏ.ఉమాపతినాయడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం పలమనేరులోని ఆర్డీవో కార్యాలయం ముందు రైతులతో కలసి నిరసన చేపట్టి తరువాత తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందించారు. అనంతరం జిల్లా రైతు నేత మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో మన రాష్ట్రంలో ప్రతి రైతు రూ.2.45 లక్షల రుణభారంతో ఉన్నారన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3 వ స్థానంలో ఉన్నదని వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులేనని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయని, కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో రైతాంగ డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. తెలంగాణా ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకూ ఎకరాకు 10 వేల రూపాయలు సాగు సాయం అందించాలని , ఎకరాల వరకు సాగు చేస్తున్న ప్రతి రైతుకు రూ 20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలని రెండు ఎకరాల పై బడిన రైతు లందరికీ ప్రతి ఎకరాకు రూ 10 వేల చొప్పున సాయం అందించాలని, పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను దష్టిలో ఉంచుకుని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీలతో రైతులకు అందించాలని మొదలైనవి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ జానకిరామ్, మురగేష్, నాగరాజ, భాస్కర్ గౌడు, రఘుపతి గౌడు, జి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



అక్రమ కట్టడాన్ని తొలగించాలి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్ పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని టీడీపీ నాయకుడు మోహన్ మురళి ఆధ్వర్యంలో మండల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ విచారించి న్యాయం చేస్తానని తెలిపినట్లు మోహన్ మురళి మంగళవారం మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కే లోకనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యదర్శి రమణారెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ చంగల్ రాయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలమనేరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ పిల్లలు క్రీడా పరికరాలను సద్వినియోగ పరచుకొని విద్యతో పాటు మానసిక వికాసం పొందాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ క్రీడా పరికరాలు అందజేసిన పలమనేరు పరిరక్షణ సమితికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పిపిఎస్ అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్ళై, శ్రీపురం సీతారామయ్య, విజయ్ కుమార్, వెంకట్, నారాయణ, సాంబయ్య, రెడ్డప్ప, రమణ, సన్నీ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మకు పొంగళ్లు



ప్రజాశక్తి-పెనుమూరు: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మకు మంగళవారం పరిసర గ్రామాల ప్రజలు వైభవంగా పొంగళ్ళు పెట్టారు. ఆనవాయితీగా ఆలయ ధర్మకర్త జంబు గోళం భాస్కర్ ఆధ్వర్యంలో పెనుమూరు బలిజ వీధిలో సత్యమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు ముత్యాలమ్మకు తొలి పూజ, అభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ హేమలత రెడ్డి, జడ్పిటిసి సభ్యులు జి దొరస్వామి యాదవ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కంచర్ల చక్రవర్తి నాయుడు, వైస్ ఎంపీపీ దూది అరుణ శంకర్, సింగల్ విండో అధ్యక్షులు కారేటి గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శం: డిప్యూటీ సీఎం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ పరిపాలన విధానాన్ని ఇతర రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుంటున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరకనెల్లూరు, వీరకనెల్లూరు దళితవాడ, సింగరాయకండిగ, పేటనత్తం గ్రామాల్లో అధికారులు, నేతలతో కలిసి డిప్యూటీ సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 26 పథకాలకు సంబంధించి డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా లబ్దిదారుల ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. పేటనత్తం గ్రామంలో సుబ్రమణ్యం నాయుడు కుమారుడు చిరంజీవి నాయుడు, అదేవిధంగా పట్టాభి రెడ్డి భార్య రేణుకలు మాట్లాడుతూ మాకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాకు రేషన్ కార్డు ఉండేదని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా రేషన్ కార్డులు మా కుటుంబాలకు రాలేదని ఈ విషయంగా సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. దీంతో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అర్హత ఉంటే సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని రేషన్ కార్డు లేదని చెప్పిన ఆ ఇరువురు వ్యక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వీరకనెల్లూరు సర్పంచ్ అమరావతి సదాశివారెడ్డి, ఎంపీటీసీ ఇందిర కోదండన్, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, మండల వైస్ ఎంపీపీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సంక్షేమ ఫలదాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని తగ్గువారిపల్లి సచివాలయ పరిధిలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రాష్ట్రంలో గత ప్రభుత్వాల కంటే మెరుగ్గా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వానిదేనని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటే గౌడ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దారి కుంట సచివాలయ పరిధిలోని పెద్దారి కుంట, చిన్నారికుంట, గురివిరెడ్డిపల్లి, ఆంజనేయపురం, బసాపరం, పిల్లిగుండ్లపల్లి, చిల్లపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లపల్లి గ్రామ ప్రజల తాగునీటి సమస్యకు పారిష్కారంగా నూతన బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుష్మా కీర్తి, మండల కన్వీనర్ బాగా రెడ్డి, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచులు రమేష్ బాబు, అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని చితూరులోని పిసిఆర్ కళాశాల ముందు మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కళాశాల తెరిచి రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఇంకా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. మన ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తున్నామని విద్యార్థుల పైన పెట్టే ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి అని గొప్పలు చెప్పుకుంటుందన్నారు.

లోకేష్ యాత్ర దిగ్విజయంగా కొనసాగాలి

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటికి 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పలమనేరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సత్య గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 216 టెంకాయలను కొట్టి మొక్కు చెల్లించి, పలువురికి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నాయకులు ఆర్‌బీసీ కుట్టీ, మదన్ మోహన్, లోకేష్‌లు మాట్లాడుతూ పాదయాత్ర ఆరంభంలో విమర్శలు చేసిన వైసీపీ నేతల నోళ్లువెల్లబెట్టుకునేలా నారా లోకేష్ తన పాదయాత్రను నిర్విరామంగా దిగ్విజయంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజాపీర్, నాగరాజ్, శ్రీధర్, సుధాకర్, రమేష్, శ్రీనివాసులు, సుబ్బు, నదీం, మురళి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రొంపిచెర్ల

రొంపిచెర్ల: నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2000 కి.మీ.లు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు రొంపిచెర్లలో మండల అధ్యక్షులు ఉయ్యాల రమణ అధ్వర్యంలో సంఘీభావ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భారీ ఎత్తున టిడిపి నాయకులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, హరిబాబు, తులసి, ద్వారక, రఫీ, మహేష్, ఇమ్రాన్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటికి 2000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు టి. ఎం. బాబు ఆధ్వర్యంలో మంగళవారం కుప్పం నియోజకవర్గం డీకే పల్లి గ్రామంలోని వెలిసిన అగ్ని మారెమ్మ దేవస్థానంలో లోకేశ్ పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేయాలని వేడుకుంటూ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గం సమన్వయ కన్వీనర్ చంద్రశేఖర్, నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పి.ఎస్. మునిరత్నం, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ హేమాంబర్గౌడ్, మాజీ ఎంపీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష

ప్రజాశక్తి-పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకం పేదలకు శ్రీరామరక్షని జడ్పిటిసి సభ్యులు అన్బలగం, ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్, తహశీల్దార్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా ఎలాంటి రుసుము లేకుండా అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు తమకు కావాల్సిన ధ్రువపత్రాలను పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసి రామ్ యాదవ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు స్వామి రాజు, ఐకెబీఏపీయం ఫరీద్ మస్తాన్, ఏవో ఢిల్లీ బాబు, విస్తరణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సోమల: సదుం మండలం బూరగమంద పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన గ్రామసభలో పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను జడ్పిటిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ప్రసాద్, ఎంపీడీవో వరప్రసాద్, బూరగమంద ఎంపీటీసీ మల్లికార్జున, ప్రకాష్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమంపై మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ప్రత్యేక అధికారి శివకుమార్, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ప్రతి ఇంటికీ వెళ్లి వారికి కావాల్సిన ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలను తెలుసుకొని యాప్‌లో అప్లోడ్ చేసి సర్వే చేపట్టారు. త్వరితగతిన వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరం: పేదల సంక్షేమానికి రాష్ట్ర సీఎం జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెటారని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. మంగళవారం కార్వేటినగరం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్పంచ్ ధనంజయ వర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ మురళి, డిటి లక్ష్మిపతి, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, ఈవో మణి, హరి, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.